ఇంటర్‌లో అక్కా చెల్లెళ్ల ప్రతిభ

తిమ్మాపూర్, ఏప్రిల్25: మండలంలోని అలుగునూర్‌లో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ కేంద్రం(సీవోఈ) కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న కవలలు చదువులో ప్రతిభ చూపించారు. గంప శార్వాణి ఎంపీసీలో 470 మార్కులకు గానూ 465 మార్కులు, గంప ప్రజ్ఞాని బైపీసీలో 440 గానూ 436 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా వారిని కళాశాల ప్రిన్సిపాల్ దేవేందర్, కళాశాల సిబ్బంది అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రభంజనం

అల్గునూరులోని సీవోఈ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో 33 మంది అడ్వాన్స్‌కు అర్హత సాధించి ప్రభంజనం సృష్టించారు. అత్యధిక పర్సంటైల్ సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ దేవేందర్, కళాశాల సిబ్బంది అభినందించారు.

ఎస్సారార్‌లో వర్క్‌షాప్

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 25 : ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'టెక్నాలజీస్ ఫర్ అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్' అంశంపై గురువారం వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ హరికాంత్ హాజరై మాట్లాడారు. కామర్స్ విద్యార్థులు సీఏ లాంటి కోర్సులు చేస్తే డాక్టర్లు, ఇంజినీర్లు లాంటి వారికి సైతం సహాయ పడవచ్చని సూచించారు. రిసోర్స్ పర్సన్‌గా హాజరైన డాక్టర్ వెంకట్ రావు ఈ వర్క్ షాప్‌లో టెక్నాలజీని సబ్జెక్టుకు ఏ విధంగా ఉపయోగించుకోవాలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ మాట్లాడుతూ, కామర్స్ విద్యార్థులు టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టీ రాజయ్య, వర్క్ షాప్ కన్వీనర్ డాక్టర్ ఏ సతీశ్‌కుమార్, కామర్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

కరీంనగర్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన నామినేషన్ల పర్వం గురువారం నాటితో ముగిసింది. ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఈ నెల 18 నుంచి నామినేషన్లు స్వీకరించారు. పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు సహా 53 మంది 94 నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నెల 29 వరకు నామినేషన్ల ఉప సంహరణకు గడువు ఇచ్చారు. అప్పటికిగాని బరిలో ఎవరెవరు ఉంటారనే విషయంలో స్పష్టత వచ్చే అవకాశం లేదు.

పోటా పోటీగా నామినేషన్లు..

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల ప్రక్రియ ఈ నెల 18న నోటిఫికేషన్ విడుదల కావడంతో ప్రారంభమైంది. కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేసి ఎన్నికల అధికారి పమేలా సత్పతి నామినేషన్లు స్వీకరించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు ఇతర పార్టీలు, స్వతంత్రులు పోటా పోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. మొదటి రెండు రోజులు కాస్త మందకొడిగా సాగిన నామినేషన్ల ప్రక్రియ ఆ తర్వాత పుంజుకుంది. ఒక్కో అభ్యర్థి రెండు అంతకు మించి నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో బీఆర్ఎస్ నుంచి బోయినపల్లి వినోద్‌కుమార్ ఈ నెల 20న అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఆయనకు మద్దతుగా ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు హాజరయ్యారు. 22న కాంగ్రెస్ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్ రావు నామినేషన్ దాఖలు చేయగా మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు ఆ పార్టీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఇక చివరి రోజైన గురువారం బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ నామినేషన్ దాఖలు చేయగా గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఇతర పార్టీల అభ్యర్థులు కూడా తమ మద్దతుదారులతో కలిసి వచ్చి నామినేషన్లు దాఖలు చేశారు. పార్లమెంట్ స్థానానికి మొత్తం 52 మంది 94 నామినేషన్లు దాఖలు చేశారు. కాగా, అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను శుక్రవారం అధికారులు పరిశీలించనున్నారు. 29 వరకు ఉప సంహరణకు గడువు ఇచ్చారు. స్వతంత్ర అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేయడంతో ఎంత మంది ఉప సంహరించుకుంటారు, ఎంత మంది బరిలో నిలుస్తారనేది 29న తేలనుంది.

రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రం అందజేస్తున్న బండి సంజయ్, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

చివరి రోజు 32 నామినేషన్లు

కలెక్టరేట్, ఏప్రిల్ 25 : పార్లమెంటు ఎన్నికల నామినేషన్లలో భాగంగా చివరి రోజైన గురువారం 27 మంది అభ్యర్థులు, 32 నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో 12 మంది స్వతంత్ర అభ్యర్థులుగా, నలుగురు వివిధ రాజకీయ పార్టీల పేరిట రిటర్నింగ్ అధికారికి తమ పత్రాలు అందజేశారు. మొత్తం 53 మంది అభ్యర్థులు 94 నామినేషన్లు వేయగా, తుదిరోజైన గురువారం పొడిశెట్టి భూమయ్య బహుజన ముక్తి పార్టీ, కడుతాల అనిల్‌రెడ్డి నవక్రాంతి పార్టీ, మాతంగి హన్మయ్య దళిత బహుజన పార్టీ, మీసాల రాజిరెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా ఆరెల్లి సుమలత, జహీదా బేగం, ఎస్.నిరంజన్, మహ్మద్ సుక్రద్దిన్, మాంకాలి తిరుపతి, పచ్చిమట్ల రవీందర్, కరికె సుభాష్, డేగల వెంకటనర్సయ్య, దుగ్యాల శ్రీలత, పళ్లెల దేవరాజు, కళ్లెం హన్మంతరెడ్డి, గుజ్జుల శ్రీనివాస్‌రెడ్డి, ఆకునూరి రాజు తమ నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారికి అందజేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ తరపున ఆరె రవిగౌడ్ నాలుగో సెట్టు, బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ మూడో సెట్టు, ఎంసీపీఐ, డీఎస్పీ అభ్యర్థులు లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, చిలువేరు శ్రీకాంత్‌లు రెండో సెట్టు, స్వతంత్ర అభ్యర్థులు గౌరిశెట్టి సురేశ్, పేరాల మానస, కట్కూరి ఏనోస్ రెండో సెట్టు నామినేషన్ పత్రాలు ఆర్వోకు సమర్పించారు.

- నేడు నామినేషన్ల పరిశీలన
- 29 వరకు ఉప సంహరణ గడువు
- ఆఖరి రోజు వెల్లువెత్తిన నామినేషన్లు
- 53 మంది అభ్యర్థులు.. 94 సెట్లు దాఖలు

హోరెత్తిన ప్రచారం..

పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన ప్పటి నుంచే పలు పార్టీలు ప్రచారాన్ని హోరెత్తించాయి. ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అందరికంటే ముందు వరుసలో ఉన్నారు. షెడ్యూల్ ప్రకటించక ముందు నుంచే ఆయన కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ ఎన్నికలకు సిద్ధం చేస్తూ వచ్చారు. పార్టీ అధినేత కేసీఆర్ కూడా ఎన్నికల ప్రచారాన్ని ఇక్కడి ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలోనే ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఏమరపాటుతో ఉన్న కార్యకర్తలు పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించాలనే సంకల్పంతో ఉత్సాహంగా పని చేస్తున్నారు. కేటీఆర్, హరీశ్‌రావు లాంటి అగ్ర నేతలు రోడ్ షోలు, కార్నర్ మీటింగ్స్ ఏర్పాటు చేస్తూ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. ఇక బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ కూడా ప్రచారం చేస్తున్నారు. అధికార కాంగ్రెస్‌లో టికెట్ విషయమై ఆలస్యం కావడం, చివరి క్షణాల్లో ఆ పార్టీ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్ రావును ప్రకటించారు. పార్టీ ప్రచారం ఇప్పుడిప్పుడే ప్రారంభమైంది. మొత్తానికి రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి.

ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు..

నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో ఎన్నికల ఏర్పాట్లను అధికారులు వేగవంతం చేశారు. ఏడు అసెంబ్లీ స్థానాలు, 42 మండలాల పరిధిలో ఉన్న కరీంనగర్ పార్లమెంట్‌లో 17,89,353 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 8,74,884 మంది పురుషులుకాగా 9,14,367 మంది మహిళలు, 102 మంది ట్రాన్స్‌జెండర్లు. వీరిలో 174 మంది ఓవర్‌సీస్ ఓటర్లు, 961 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. కాగా, దివ్యాంగ ఓటర్లు 41,718 మంది ఉండగా, 85 సంవత్సరాలు దాటిన వారు 13,780 మంది ఉన్నారు. పార్లమెంట్ పరిధిలో 2,194 పోలింగ్ బూత్‌లు ఉండగా 1,484 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. 288 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఎన్నికల ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలకులను నియమించింది.

ఫిర్యాదుల కోసం ఎన్నికల పరిశీలకులను సంప్రదించాలి

జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

కలెక్టరేట్, ఏప్రిల్ 25 : కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గంలో ఎన్నికల అంశాలకు సంబంధించి ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల సాధారణ పరిశీలకులను సంప్రదించవచ్చని రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కోసం సాధారణ పరిశీలకుడు ఐఏఎస్ అధికారి అమిత్ కటారియాను మొబైల్ నంబరు 9177435833లో సంప్రదించాలని సూచించారు. అలాగే, ఎన్నికల వ్యయ పరిశీలకుడు అశ్వినీ కుమార్ పాండ్యకు మొబైల్ నంబరు 9032659531లో ఎన్నికల వ్యయం, ఇతర అంశాలపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. రహదారులు, భవనాల అతిథి గృహంలో ప్రతి రోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు ఎన్నికల పరిశీలకులు ప్రజలకు అందుబాటులో ఉంటారని, ఫోన్ ద్వారా లేదా, నేరుగా వెళ్లి కూడా ఫిర్యాదు చేయవచ్చని గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

400 సీట్లలో విజయం సాధిస్తాం

- గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్
- బండి సంజయ్ నామినేషన్ కార్యక్రమానికి హాజరు

విద్యానగర్, ఏప్రిల్ 25: నరేంద్ర మోదీ నేతృత్వంలో 400 లోక్‌సభ సీట్లలో బీజేపీ విజయం సాధిస్తుందని గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ అన్నారు. గురువారం కరీంనగర్‌లో బండి సంజయ్ నామినేషన్ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లోక సభ ఎన్నికల్లో ఇప్పటికే గుజరాత్‌లోని సూరత్ లోక్‌సభ స్థానాన్ని బీజేపీ ఏకగ్రీవంగా గెలుచుకుందన్నారు. ఇంకా 399 సీట్లలో మనం గెలిపించుకోవాలన్నారు. బండి సంజయ్ మాట్లాడుతూ, రూ.వందల కోట్లు ఖర్చుపెట్టి టికెట్ తెచ్చుకున్న కాంగ్రెస్ అభ్యర్థి ఏనాడైనా పార్టీ జెండాలు పట్టుకొని ప్రజల పక్షాన పోరాడారా? అని ప్రశ్నించారు. జనం కోసం ఒక్క ఉద్యమమైనా చేశారా అని నిలదీశారు. నామినేషన్ కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించగా, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తలంబ్రాలు, అక్షింతల పేరుతో రాజకీయం చేస్తున్నారు

- మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

మానకొండూర్: కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మానకొండూర్/ తిమ్మాపూర్, ఏప్రిల్ 25: బీజేపీ నాయకులు రాముడి ఫొటోలు అడ్డుపెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని, తలంబ్రాలు, అక్షింతల పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ దుయ్యబట్టారు. గురువారం మానకొండూర్ మండల కేంద్రంలో, తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉండి దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలు పెంచిందని, నిరుపేద ప్రజలను నిండా ముంచిందని మండిపడ్డారు. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ చదువు రాని మూర్కుడని, ఐదేళ్లలో ఎంపీగా ఉండి కరీంనగర్‌కు చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో అల్ఫోర్స్ ప్రభంజనం

ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి

రామడుగు(చొప్పదండి), ఏప్రిల్ 25: రామడుగు మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో చెట్ల శ్రావ్య 467/470 మార్కులతో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించారు. అల్వాల దీపిక 466/470, తూడి శ్రీనివాస్ 466/470, గండ్ర రష్మిత, మిట్ట వైష్ణవి, బండ నిక్షిప్త 465/470 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో బేతి హాసిని 980/1000 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించారు. బుర్ర సంగీత 976/1000, మరో ముగ్గురు విద్యార్థులు 975/1000 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సర్కారు దవాఖానల్లో మెరుగైన వైద్యం

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్25: ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని, గ్రామీణులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని వైద్య విధాన్ పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ సూచించారు. గురువారం హుజూరాబాద్ ఏరియా దవాఖానను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి, ఆర్ఎంవో డాక్టర్ సుధాకర్‌ను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలం దృష్ట్యా పలు సూచనలు చేశారు. ఆయనను వైద్యులు సత్కరించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ కృష్ణప్రసాద్, వైద్యులు నారాయణరెడ్డి, సోమశేఖర్, పీ శ్రీకాంత్‌రెడ్డి, సురేశ్, వాణీలత, అర్చన, శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

నీఎం రేవంత్ రెడ్డికి రాసిన పోస్టుకార్డులతో బండ శ్రీనివాస్, రైతులు

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 25: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండలంలోని కందుగుల గ్రామంలో జడ్పీటీసీ పడిదం బక్కారెడ్డి, రైతులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డికి పోస్టు కార్డులు రాశారు. అనంతరం వాటిని పోస్ట్ చేశారు. అంతకుముందు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బెల్లి రాజయ్య, రఘుపతిరెడ్డి, సతీశ్, మధుతో పాటు రైతులు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి రథోత్సవం

ఇల్లందకుంట, ఏప్రిల్ 25: ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన రాములోరి రథోత్సవం కనుల పండువగా సాగింది. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవమూర్తులను పూలతో అలంకరించిన రథంపై ఊరేగించారు. హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవాలయ ఈవో కందుల సుధాకర్, అర్చకులు శేషంరామాచార్యులు, వంశీధరాచార్యులు, లోకాచార్యులు, జమ్మికుంట సీఐ కిశోర్, ఎస్ఐ రాజ్‌కుమార్, దేవాలయ సిబ్బంది మోహన్, రాజయ్య, మల్లారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఇల్లందకుంటలో రథోత్సవానికి తరలివచ్చిన భక్తులు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

బీజేపీని ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 25: కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నిరంకుశ పాలన కొనసాగిస్తున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని పార్టీ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవనంలో గురువారం జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి రాష్ట్ర జిల్లా నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికార దాహం తప్ప ప్రజల సంక్షేమాన్ని బీజేపీ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ప్రతిపక్షాల మీద సీబీఐ, ఐటీ, ఈడీ సంస్థలతో దాడులు చేయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నదని మండిపడ్డారు. ప్రజా స్వామ్యం లేకుండా నియతృత్వ పాలన దిశగా బీజేపీ కుట్రలు చేస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈ మేరకు ఎన్నికల్లో తమ మద్దతు కోసం చర్చలకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు స్పష్టం చేసినట్లు తెలిపారు. ప్రజల ఆకాంక్ష మేరకు ప్రభుత్వం పని చేయాలని సూచించామన్నారు. సమావేశంలో నాయకులు పొనగంటి కేదారి, బుచ్చన్న యాదవ్, బోయిని అశోక్, పైడిపల్లి రాజు, తిరుపతి, మురళి పాల్గొన్నారు.

'కారు గుర్తుకు ఓటు వేయాలి'

మానకొండూర్ రూరల్, ఏప్రిల్ 25: పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను ఆశీర్వదించాలని ఆయన తనయుడు బోయినపల్లి ప్రణయ్ కోరారు. గురువారం శ్రీనివాస్‌నగర్‌లో ఇంటింటికీ ప్రచారం కార్యక్రమంలో పాల్గొన్న ప్రణయ్ మాట్లాడుతూ, కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసే సత్తా వినోద్ కుమార్‌కు ఉందని గుర్తు చేశారు. గతంలో ఎంపీగా ఎన్నో అభివృద్ధి పనులు చేశారన్నారు. అలాగే గ్రామ శివారులోని ఉపాధిహామీ పని ప్రదేశానికి చేరుకొని కూలీలతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, ఎంపీగా వినోద్ కుమార్ చేసిన అభివృద్ధిని గురించి వివరించారు. వినోద్ కుమార్‌ను ఆశీర్వదించి, పార్లమెంట్‌కు పంపాలని అభ్యర్థించారు. ఇక్కడ నాయకులు ఎరుకల శ్రీనివాస్ గౌడ్, అనవేని రాజు, ఎరవేని చందూ, బొడ్డు రాజు, మెండి మహేశ్, రంగరవేని సంతు, మోహన్ తదితరులు ఉన్నారు.

శ్రీనివాస్‌నగర్‌లో ఇంటింటా ప్రచారం చేస్తున్న బోయినపల్లి ప్రణయ్

చొప్పదండి పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

వినోద్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి

- చొప్పదండి పట్టణంలో ప్రచారం నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి, ఏప్రిల్25: పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ నియోజక వర్గ పార్లమెంటు ఎన్నికల ఇన్‌చార్జి భూపతిరెడ్డి, డాక్టర్ అమిత్‌తో కలిసి చొప్పదండి మున్సిపాలిటీ పరిధిలోని 14వార్డుల్లో గడపగడప ప్రచారం నిర్వహించారు. ప్రజలను ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ మోసపూరిత ఆరు గ్యారెంటీలతో మోసపోయి గోసపడుతున్నామని, మళ్లీ మోసపోవద్దని సూచించారు. బీఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపెల్లి విజయలక్ష్మి-సాంబయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, కౌన్సిలర్లు మాడూరి శ్రీనివాస్, కొత్తూరి మహేశ్, బిజిలి అనిత, బీఆర్ఎస్ నాయకులు దండే కృష్ణ, కొత్తూరి నరేశ్, మహేశుని మల్లేశం, జహీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు తప్పవు

శంకరపట్నం, ఏప్రిల్ 25: చెరువు శిఖంలు, గుట్టలు, తదితర ప్రభుత్వ స్థలాల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అనుపమారావు హెచ్చరించారు. కొత్తగట్టు గ్రామంలో లోయకుంట చెరువు శిఖం నుంచి పలువురు అక్రమంగా ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్నారనే ఫిర్యాదు మేరకు గురువారం జీపీలో విచారణ నిర్వహించారు. తహసీల్దార్ ఎంపీడీవో, గ్రామ ప్రత్యేకాధికారి శ్రీవాణితో కలిసి కొత్తగట్టు వెళ్లి ఎక్స్‌కవేటర్ల ఓనర్లను పిలిపించారు. ఇకనుంచి ఎవరు అక్రమంగా మట్టిని తరలించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేకాక పట్టా భూముల నుంచి మట్టిని తరలించినా కూడా అధికారుల అనుమతులు తప్పసరి అని తెలిపారు. అలాగే అయ్యోరుకుంట చెరువు కట్టకు రామగిరి లింగయ్య అనే వ్యక్తి గండి కొట్టగా అధికారులు పరిశీలించారు. వెంటనే గండి పూడ్చాలని లేదా జరిమానా తప్పదని లింగయ్యను హెచ్చరించారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శి స్వప్న, పోలీసు సిబ్బంది, జీపీ సిబ్బంది, ఎక్స్‌కవేటర్ల ఓనర్లు ఉన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయాల హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

కొత్తపల్లి, ఏప్రిల్ 25 : కేరళ రాష్ట్రంలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో మే 2 నుంచి 6వ తేదీ వరకు జరుగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల హ్యాండ్‌బాల్ పోటీలకు వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన గుర్రం తిరుమలేశ్ ఎంపికైనట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పీ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. ఇటీవల శాతవాహన విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొన్న తిరుమలేశ్ అద్భుత ప్రతిభ చూపి అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల ఎంపికయ్యాడన్నారు. విద్యార్థిని కళాశాల కరస్పాండెంట్ వీ ఆగం రావు, ప్రిన్సిపాల్ డా. సీహెచ్ శ్రీనివాస్, ఏవో శ్రవణ్‌కుమార్ తదితరులు అభినందించారు.

హుజూరాబాద్ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా సదాశివ

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్ 25: హుజూరాబాద్ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా సదాశివ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న మక్సూద్ అలీ సెలవులో వెళ్లడంతో ఆయన స్థానంలో జిల్లా సబ్ రిజిస్ట్రార్ ప్రవీణ్‌కుమార్ సిరిసిల్లలో పనిచేసే సదాశివను ఇన్‌చార్జిగా నియమించారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా

కళాశాల ప్రాంగణంలో కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 25 : కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా వచ్చిందని, గురువారం యూజీసీ నుంచి ఉత్తర్వులు కూడా అందాయని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టీ శ్రీలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ హోదా వచ్చే విద్యా సంవత్సరం అనగా 2024-25 నుంచి 2033-34 వరకు పది సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. ఈ నెల 16న జరిగిన సమావేశంలో స్వయం ప్రతిపత్తి హోదాను యూసీజీ రెగ్యులేషన్స్, 2023-7.5 క్లాస్ ప్రకారం కల్పిస్తున్నట్లు యూజీసీ డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ గోపీచంద్ మెరుగు మెయిల్ ద్వారా తెలిపారని వివరించారు.

శిక్షణతో వృత్తి నైపుణ